ప్రమాణ స్వీకారోత్సవం



ప్రమాణస్వీకారం చేస్తున్న సంగమేశ్వర దేవాలయ కమిటీ

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ గాంధీనగర్‌లోని ప్రసిద్ధిగాంచిన సంగమేశ్వర దేవాలయ కమిటీ నూతన చైర్మన్‌గా బీసీ వెంకటేష్‌గౌడ్ నియమితులయ్యారు. గురువారం ఆలయంలో ఆయన చేత ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, దేవాదాయ శాఖ ఈవో లక్ష్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆండాలు ప్రమాణస్వీకారం చేయించారు. వారితో పాటు ధర్మకర్తలుగా రజనీకాంత్, రవి, శ్రీనివాస్, లక్ష్మీ, వినోద్‌గౌడ్, చంద్రశేఖర్‌లచే ప్రమాణస్వీకారం చేశారు.

గుల్షన్‌నగర్‌లో చెత్తను తరలించండి



మట్టికుప్ప, చెత్తను తొలగించాలని కోరుతున్న అక్లక్‌హుస్సేన్ తదితరులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ గుల్షన్‌నగర్‌లో నెల క్రితం రోడ్డు వేసి మట్టిని తొలగించలేదు. దీంతో స్థానికులు అక్కడే చెత్త వేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు అక్లక్ హుస్సేన్ ఆరోపించారు. దీని వల్ల దోమలు, ఈగలు పెరగడంతో పాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే మట్టికుప్పలను తొలగించాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న వైద్యులు

ముషీరాబాద్: స్వాంతన చారిటబుల్ ట్రస్ట్, గద్దె రామోజీ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బాపూజీనగర్ కమ్యూనిటీహాల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కిమ్స్ ఆస్పత్రి నుంచి జనరల్ ఫిజిషియన్, గైనకాలజిస్ట్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ వైద్యులు 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ శిబిరంలో బస్తీ నాయకుడు జీఎస్ చారి, కిమ్స్ ఫౌండేషన్ క్యాంపు కోఆర్డినేటర్ విక్రమ్, నర్సింగ్‌రావు, వలంటీర్లు లావణ్య, లలిత, అమృత, హారిక తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనానికి అధిక ప్రాధాన్యం



రామకృష్ణనగర్ పార్కులో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: డివిజన్‌లో పచ్చదనానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం డివిజన్‌లోని రామకృష్ణనగర్ పార్కులో వన మహోత్సవంలో భాగంగా ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.... డివిజన్‌లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చొరవ తీసుకుంటానన్నారు. వర్ష కాలం ముగిసేలోపు పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు కృషి చేస్తామని తెలిపారు.

వేలాడే వైర్లను తొలగించి.. బంచ్ కేబుల్ వైర్లు వేసి.!



చిక్కడపల్లి: బాపునగర్‌లో విద్యుత్ తీగలు ఇళ్ల మధ్యలో చాలా కాలంగా ప్రమాదకరం ఉండేవని బంచ్ కేబుల్ వైర్లు వేయడంతో సమస్య పరిష్కారం అయ్యిందని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని బాపునగర్‌బస్తీలో వేలాడుతున్న విద్యుత్ తీగలను తీసేసి కొత్తగా బంచ్ కేబుల్ వైర్లను వేశారు. ఈ పనులను ఇందిరాపార్క్ ఏఈ గోపాలకృష్ణతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. సమస్య పరిష్కారం కావడంతో కార్పొరేటర్, అధికారులకు బస్తీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, దామోదర్, రాజేందర్, బస్తీవాసులు శ్రీనివాస్, శోభ, కోటేశ్వరి, అమృత, లావణ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఎక్కువ.. గదులు తక్కువ.!

పాఠశాలల్లో వరండా, డైనింగ్ హాళ్లు లేక చెట్ల కిందే భోజనం

- వర్షాకాలంలో విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- చాలా పాఠశాలల్లో కానరాని తాగునీటి వసతి
- ఇంటి నుంచే నీటిని తెచ్చుకుంటున్న వైనం



పాఠశాల ఆవరణలోనే నేలపై కూర్చొని భోజనాల చేస్తున్న విద్యార్థులు

కవాడిగూడ: కవాడిగూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో 645 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో ఉన్న తరగతి గదులు చాలా చిన్నవి. విద్యార్థుల సంఖ్యకు ఈ గదులు ఏ మాత్రం సరిపోవడం లేదు. ఇక్కడ వరండా సైతం లేకపోవడంతో పాఠశాల ఆవరణలోని చెట్లకింద నేలపై విద్యార్థులు కూర్చొని అల్పాహారం, మధ్యాహ్నం భోజనం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో తేలికపాటి జల్లులు పడినా విద్యార్థులు ఎన్నో అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంటోంది. కనీసం తాగడానికి మంచి నీళ్లు సైతం అందుబాటులో లేవు. ఫలితంగా ఇంటి నుంచి విద్యార్థులు తమ వెంట బాటిళ్లలో నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది.

ఏ బడిలో డైనింగ్ హాల్ లేదు...

నియోజకవర్గంలోని 95 శాతానికి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో డైనింగ్‌హాళ్లు లేవు. వరండా లేదా చెట్ల కిందే విద్యార్థులు కూర్చొని మధ్యాహ్న భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నా డైనింగ్ హాల్ లేకపోవడం సమస్యగా మారింది. దీంతో అపరిశుభ్ర పరిసరాల మధ్య మధ్యాహ్న భోజనం చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అదనపు తరగతి గదులతో పాటు డైనింగ్ హాళ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

గదులు నిర్మించి సౌకర్యాలను కల్పించాలి..

ముషీరాబాద్ 1, 2 మండలాల పరిధిలో 7 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు మొత్తం 22 ఉన్నాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మొత్తం 4058 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో చాలా వరకు సరిపడ తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజనం చేయడానికి డైనింగ్ హాళ్లు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థులకు సరిపడా గదులు నిర్మించి సౌకర్యాలను కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బీసీ గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలి

సీఎంకు లేఖ రాసిన ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీ గురుకుల పాఠశాలల్లో తరగతి గదులను పెంచి సీట్లను పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ గురుకుల పాఠశాలల్లో వేల సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులకు సీట్లు దొరక్క అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. సీట్ల సంఖ్యను పెంచి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సీటు వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని గురువారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు సీట్ల కోసం తెలుగు సంక్షేమ భవన్ చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. బీసీ గురుకుల పాఠశాలల్లో సీట్లకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉన్నందున 10శాతం సీట్లు పెంచాలని కోరారు. ప్రతి పాఠశాలలో అదనపు సెక్షన్లు ప్రారంభించాలన్నారు. మరో 100 బీసీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. అద్దె భవనాల్లో ఉన్న బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

సి.నారాయణరెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడు

చిక్కడపల్లి: పద్మభూషణ్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి గొప్ప పరిపాలనదక్షుడని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో సీ.నారాయణరెడ్డి జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు డాక్టర్ సినారె పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సినారె తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడిని సృష్టించారన్నారు. ప్రజలకు అర్థమయ్యే రీతిలో రచనలు చేసి వారి మనసులు చూరగొన్నారన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, నిర్వహణ సంస్థ అధ్యక్షుడు ఎం.కె.రాము, వ్యాఖ్యాత ఎంకేఆర్ ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.



సుద్దాల అశోక్‌తేజకు డాక్టర్ సినారె పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న కొలకలూరి ఇనాక్ తదితరులు

గురు పౌర్ణమి

గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని దేవాలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి, సాయిబాబా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల్లో గురువులను శాలువాతో సత్కరించి పాదపూజ చేశారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం



గోల్నాకలోని సాయిబాబ ఆలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతుల పూజలు



బాగ్‌లింగంపల్లిలోని సాయిబాబా దర్శించుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్



ముషీరాబాద్‌లో సాయిబాబాను దర్శించుకుంటున్న ముఠా జైసింహ, నేతలు



దోమలగూడ హనుమాన్ ఆలయ పూజారి అల్లం ప్రభును సన్మానిస్తున్న సలంద్రి శ్రీనివాస్



రాంనగర్ గుండులో వివిధ కులవృత్తులకు చెందిన గురువులను సన్మానిస్తున్న పూస రాజు

సమస్యల పరిష్కారంలో అలసత్వం వీడాలి

చిక్కడపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వీడాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. గురువారం వీవీగిరినగర్ బస్తీలో వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో నెలకొన్న సమస్యలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. డ్రైనేజీ, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, రాకేష్‌కుమార్, పున్న సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, ముచ్చకుర్తి ప్రభాకర్, జి.వెంకటేష్, బస్తీ అధ్యక్షుడు జాకబ్, నర్సింగ్, శ్రీను, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వీవీగిరినగర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, అధికారులు

ఏఐ, డేటా సైన్స్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్ కోర్సుల్లో శిక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ వెంకటారెడ్డి తెలిపారు. వందకు పైగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకై ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఇంటర్, ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ, ఆల్ టెక్నిక్ డిప్లొమా విద్యార్థులు దరఖాస్తులకు అర్హులని తెలిపారు. ఈ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్లు అందజేస్తుందని పేర్కొన్నారు. ఈ కోర్సుల కాల వ్యవధి 2 నుంచి 12 నెలల వరకు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.95058 00050లో సంప్రదించాలని కోరారు.

మానవ సేవే మాధవ సేవ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మానవ సేవే మాధవ సేవా అని పేదల ఆకలిని తీర్చడం ఎంతో పుణ్య కార్యక్రమంగా భావిస్తున్నామని కందూరి కృష్ణ ఫౌండేషన్ సభ్యురాలు ఐరా దిషాతి అన్నారు. గురువారం చిక్కడపల్లిలో కందూరి కృష్ణ ఫౌండేషన్, సేత్ అగర్వాల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 1500 మందికి అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కందూరి కృష్ణ, అడ్వకేట్ కౌశిక్, జ్వాలా వరాలి, హెచ్.గోవిందరావు, డా. సంగీత్, రిటైర్డ్ ఏసీపీ నారాయణగౌడ్, ప్రమోద్ అగర్వాల్, అరుణ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై నాన్చివేత ధోరణి తగదు

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లపై నాన్చివేత ధోరణి తగదని దీనిపై స్పష్టత ఇవ్వాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి సీఎం నేతృత్వంలో బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఢిల్లీకి వెళ్లాలని అన్నారు. రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు భూషణ్ భాస్కర్, డాక్టర్ ప్రశాంత్ నిమ్కర్, సత్యపాల్‌సింగ్, ప్రదీప్ గౌడ్, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లకు రెండో శనివారం సెలవు ఇవ్వాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్లకు రెండో శనివారం సెలవు ఇవ్వాలని టీపీటీఎల్ఎఫ్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డా. నవీన్ నికోలస్‌ను గురువారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. 25శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడానికి జీఓ తీసుకురావాలని విజ్ఞప్తి చేశామన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు విజయకుమార్, నాగరాజు, రజినీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరిస్తా



వాటర్ వర్క్స్ మేనేజర్ సుప్రజను సన్మానిస్తున్న బస్తీ వాసులు

కవాడిగూడ: వినాయక్‌నగర్ బస్తీలో కలుషిత నీటి సరఫరాను సమస్యను పరిష్కరించాలని స్థానికులు జలమండలి అధికారులను కోరారు. ఈ మేరకు దోమలగూడ సెక్షన్ జలమండలి మేనేజర్ సుప్రజ గురువారం అధికారులతో కలిసి బస్తీలో పర్యటించారు. నేరుగా సమస్యను తెలుసుకున్న ఆమె కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బస్తీవాసులు అధికారి సుప్రజను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.పరశురాం, రామ్‌లాల్, ఆనంద్, ప్రవీణ్, సోనూ శివ, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి



టీయూజేఏసీ సమావేశంలో నూతన కమిటీ సభ్యులు

చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు ఆదుకుంటామని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ (టీయూజేఏసీ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. చిక్కడపల్లిలోని టీయూజేఏసీ కేంద్ర కార్యాలయంలో గురువారం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా తుమ్మల ప్రపుల్‌రామిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకునే దిశలో ఉన్న టీయూజేఏసీలో చీలికలు తెచ్చేందుకు కొందరు యత్నించారని అన్నారు. వారి కుట్రలను పసిగట్టి వారిని సంస్థ నుంచి బహిష్కరిస్తున్నామని తెలిపారు. వారికి టీయుజేఏసీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. టీయుజేఏసీ ముఖ్య సలహాదారుడిగా బోయపల్లి రంగారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా ప్రొ. కోదండరాం, సలహాదారులుగా శంకర్‌రావు, అన్వర్ పటేల్, గొల్లపల్లి దయానంద్, ఉపాధ్యక్షులుగా మోహన్ బైరాగి, అంజలికుమారి, కంటర్ల బద్రి, జై ఇందిరా, పి.లక్ష్మీకాంతమ్మ, ప్రధాన కార్యదర్శిగా కే.చంద్రన్నప్రసాద్, బాకారం లావణ్య, ఏపీ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా తుల్జారెడ్డి, మంచాల వెంకటస్వామి, సుదర్శన్, సంయుక్త కార్యదర్శులుగా కొంపల్లి సాయిలు, హరికృష్ణ, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా రాజేష్ ఎన్నికయ్యారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలి

ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ భద్రసేన్

కాచిగూడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలని ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ భద్రసేన్ అన్నారు. గురువారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అవినీతి లేని పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న అధ్యాపకులు సేవా భావంతో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకులు విద్యాబోధన చేయాలని సూచించారు. కళాశాలలో చదివే పేద విద్యార్థులు తమ కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చి శ్రద్ధగా చదువుకోవాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులు ఎన్నో ఉన్నత పదవులు చేపట్టారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ శాఖ అధికారి ఆనంద్‌కుమార్, ప్రిన్సిపల్ డా. చిరంజీవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న భద్రసేన్

రసాభాసగా బోనాల చెక్కుల పంపిణీ

- కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చిన ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్
- 2గంటలు వేచి చూసి అసహనంతో వెళ్లిపోయిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



2 గంటలు వేచి చూసి అసహనంతో వెళ్లిపోతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నేతలు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో బోనాల ఉత్సవాల చెక్కుల పంపిణీ కార్యక్రమం వివాదంగా మారింది. కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ నేతల మధ్య ఉన్న విభేదాలతో చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఐదు నిమిషాల్లో వస్తున్నామని చెప్పి 2గంటలు ఆలస్యంగా రావడంతో తీవ్ర అసంతృప్తితో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనుదిరిగి వెళ్లిపోయారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని 201 అమ్మవారి దేవాలయాల్లో బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ.1,07,60,500 విలువ చేసే చెక్కులను మంజూరు చేసింది. దేవాలయాల కమిటీ నిర్వాహకులు చెక్కులు అందజేసేందుకు గురువారం భోలక్‌పూర్‌లోని భవానీశంకర దేవాలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులు వేదిక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ముషీరాబాద్ నియోజకవర్గం బోనాల ఉత్సవాల పంపిణీ ఇన్‌చార్జి సత్యనారాయణ పర్యవేక్షణలో కొనసాగింది.

అరగంటలో వస్తున్నానని...

ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆరు డివిజన్ల కార్పొరేటర్లకు ఉదయం 10గంటలకు రావాలని అధికారులు ముందస్తుగా ఆహ్వానించారు. దీనితో ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ, ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజులతో పాటు ఆలయ కమిటీ నిర్వహకులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అక్కడకు చేరుకున్నారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ రాకపోవడంతో ఆయనకు ఫోన్ చేశారు. అరగంటలో వస్తున్నామని కాంగ్రెస్ కార్యకర్తలకు సమాచారం ఇవ్వడంతో ఎమ్మెల్యే ముఠా గోపాల్ అక్కడే కూర్చున్నారు. ఎమెల్యే సైతం అనిల్‌కుమార్‌యాదవ్‌కు స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు.

ఇది కాంగ్రెస్ కార్యక్రమమా.? బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమమా?

అలా 2గంటలు వేదిక వద్ద కూర్చున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ దేవాదాయ శాఖ అధికారులను నిలదీశారు. తాను కొన్ని చెక్కులు ఇచ్చి వెళ్తాను మీరు కార్యక్రమాన్ని కొనసాగించుకోండని ఎమ్మెల్యే అధికారులను కోరారు. కానీ అధికారులు కొద్ది సేపు వేచి ఉండమని విజ్ఞప్తి చేశారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులు కల్పించుకుని చెక్కుల పంపిణీ ఇన్‌చార్జి సత్యనారాయణతో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే ఎంత సేపు వేచి ఉంటారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు ఇచ్చే ఇదేనా అని నిలదీశారు. ఇది కాంగ్రెస్ పార్టీ కార్యక్రమా.? బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట వెళ్లిపోయారు.



ఆలయ కమిటీ నిర్వాహకులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

ఇతర కార్యక్రమాల వల్లే ఆలస్యం: ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

తాను ఉద్దేశపూర్వకంగా ఆలస్యంగా రాలేదని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. అధికారులు సమాచారం ఇచ్చిన వెంటనే సిద్ధం అయ్యానని తెలిపారు. కానీ అప్పటికి సభా వేదిక వద్ద ఎమ్మెల్యే గానీ, ఆలయ కమిటీ నిర్వాహకులు గానీ రాలేదని సమాచారం రావడంతో మరో కార్యక్రమానికి వెళ్లాల్సి వచ్చిందన్నారు. తనకు ఎమ్మెల్యే అంటే గౌరవం ఉందని ఆయన తన అన్నలాంటి వారని అన్నారు. ఆయనతో ఫోన్‌లో మాట్లాడుతానని జరిగిన విషయం చెబుతానని చెప్పుకొచ్చారు. బోనాల ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా వైభవంగా నిర్వహించేందుకు చూస్తోందన్నారు. బోనాల ఉత్సవాలను రాజకీయం చేయొద్దని అందరం కలిసి బోనాలను వైభవంగా నిర్వహించుకుందామని కోరారు. అనంతరం ఆయన కమిటీ నిర్వాహకులకు చెక్కులు పంపిణీ చేశారు. ఆయన వెంట భవాని శంకర ఆలయ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు మేడి సురేష్‌కుమార్, నాయకులు సంగపాక వెంకట్, మధు, డి.వెంకటేష్, మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.